క్లుప్తంగా

డీజిల్ బంక్ కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ కేతన్ గార్గ్

బుక్కరాయసముద్రం: రోటరీపురం సమీపంలో డీజిల్ బంక్ ఏర్పాటుకు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో సర్వే నెంబర్114–2లో 25 సెంట్లు భూమిలో ఎన్‌హెచ్ 544 పనులకు నిమిత్తం ఎస్‌ఆర్ కన్‌స్ట్రషన్ ఆధ్వర్యంలో తాత్కాలిక డీజిల్ పెట్రోలు బంక్ నిర్మాణం చేపడుతున్నారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ నిబంధనలు మేరకు డీజిల్ బంక్ ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కాలుష్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ రమాదేవి, డీటీ నారాయణస్వామి ఉన్నారు.

రాష్ట్రస్థాయి విజేతగా నిలవాలి



ముస్కాన్‌కు రాకెట్, షూ అందిస్తున్న డీఎస్పీ గంగయ్య, సిబ్బంది

తాడిపత్రి: ముస్కాన్ రాష్ట్రస్థాయి అండర్ – 11 బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలవాలని తాడిపత్రి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సీఎం గంగయ్య ఆకాంక్షించారు. జిల్లా స్థాయి అండర్ –11 బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచిన తాడిపత్రికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ చాంద్‌బాషా కుమార్తె ముస్కాన్‌ను శుక్రవారం తాడిపత్రి సబ్ డివిజన్ పోలీసుల అధికారులు, సిబ్బంది డీఎస్పీ కార్యాలయంలో అభినందించారు. బాలికకు బ్యాడ్మింటన్ రాకెట్, షూ అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

గార్లదిన్నె: మండలంలో ఎవరైనా శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ అస్రార్ బాషా హెచ్చరించారు. శుక్రవారం ముకుందాపురంలో సీఐ, ఎస్ఐ సాగర్ పర్యటించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో చిన్న, చిన్న సమస్యలకు ఘర్షణ పడి కేసులు పెట్టుకోరాదన్నారు. సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. భూ సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల సూచన మేరకు నడుచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో భూ సమస్యపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.


కుష్టు బాధితులకు స్క్రీనింగ్



కుష్టు బాధితుడిని పరీక్షిస్తున్న ఫిజియోథెరపిస్ట్ మహబూబ్‌బాషా

తాడిపత్రి: స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో శుక్రవారం కుష్టు బాధితులకు శస్త్ర చికిత్స కోసం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా 8 మంది బాధితులు హాజరవ్వగా ముగ్గురిని ఎంపిక చేసినట్లు ఫిజియోథెరపిస్టు మహబూబ్‌బాషా తెలిపారు. వీరికి అనంతపురంలోని కుష్టు ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ బాల ఓబులు, రామచంద్ర, నోడల్ పర్సన్ నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళారంగాన్ని కాపాడుదాం



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పౌరాణిక నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో పౌరాణిక రంగ కళాకారులు ప్రోత్సహించేందుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పౌరాణిక నటీనటులు, హార్మోనిస్టులు తదితరులు దాదాపు 56 మంది కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు సుధాకర్, గౌరవాధ్యక్షుడు రిటైర్డు తహసీల్దార్ చలపతి మాట్లాడుతూ పౌరాణిక రంగం కనుమరుగవుతున్న నేపథ్యంలో నాటి వైభవాన్ని గుర్తు చేసేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ అక్కిరెడ్డి చేతుల మీదుగా కళాకారులకు రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా మల్లికార్జునశాస్త్రి, పరంధామయ్య, త్యాగరాజు, లక్ష్మీపతి వ్యవహరించారు.

డ్వాక్రా మహిళల అభ్యున్నతే లక్ష్యం



ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, మహిళలు

గుంతకల్లు రూరల్: డ్వాక్రా మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ మెగా చెక్కును అందజేశారు. వైకేపీ ఏపీఎం వీరాస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకంతోపాటు కేక్ కట్‌చేసి అక్కచెల్లెమ్మలకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ మేరకు సీఎం జగన్ డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీకే రుణాలను అందిస్తున్నారన్నారు. చెప్పినట్టుగానే వరుసగా నాలుగో ఏడాది సున్నావడ్డీ నగదును ముఖ్యమంత్రి మహిళల ఖాతాల్లో జమచేశారని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 9.48 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెమ్మలు బ్యాంకులకు చెల్లించిన వడ్డీ రూ.1353.76 కోట్ల నగదును వారి ఖాతాల్లో చేసి అక్క చెల్లెమ్మలపై ఆయనకున్న ప్రేమను మరోసారి చాటుకున్నాడన్నారు. ఎంపీపీ బీవీ మాధవి, వైకేపీ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్: ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం ఎమ్మెల్యేను ఏపీ ఎన్‌జీఓ సంఘం తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు సంపూర్ణ, రామాంజనేయులు ఆయన నివాసంలో కలిసి రాష్ట్రమహాసభలకు రావాలని ఆహ్వానించారు. ఎన్‌జీఓ తాలుకా అసోసియేట్ అధ్యక్షుడు చాంద్ బాషా, ఉపాధ్యక్షుడు యు.ఎర్రిస్వామి, సంయుక్త కార్యదర్శులు మురళీకృష్ణ, శ్రీరాములు, జయప్రద, సుధీర్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఖాతాలకు రూ.8.23 కోట్లు విడుదల

శింగనమల: నియోజకవర్గంలోని 5792 డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ రూ.8.23 కోట్లు విడుదలైనట్లు ఏపీఎం నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలో 1,350 మహిళ సంఘాలకు రూ.1.91 కోట్లు, గార్లదిన్నె 104 మహిళ సంఘాలకు రూ.1.49 కోట్లు, నార్పల 1,186 సంఘాలకు రూ.1.66 కోట్లు, పుట్లూరు 740 సంఘాలకు రూ.99 లక్షలు, శింగనమల 795 సంఘాలకు రూ.1.09 కోట్లు, యల్లనూరు మండలంలో 681 సంఘాలకు రూ.1.10 కోట్లు జమైందన్నారు. 2019–20లో 5169 సంఘాలకు రూ.12.33 కోట్లు, 2020–21లో 5,897 సంఘాలకు రూ.10.23 కోట్లు, 2021–22లో 6,047 సంఘాలకు రూ.11.03 కోట్ల చొప్పున లబ్ధి చేకూరిందని వివరించారు.

తాడిపత్రి నియోజకవర్గానికి రూ7.36 కోట్లు విడుదల

తాడిపత్రి: వైఎస్సార్ సున్నావడ్డీ పథకం కింద నియోజకవర్గంలోని 5,135 పొదుపు సంఘాలకు రూ.7.36 కోట్లను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. తాడిపత్రిలోని 1,361 డ్వాక్రా సంఘాలకు రూ. 2.51 కోట్లు, తాడిపత్రి మండలంలోని 1,016 సంఘాలకు రూ.1.36 కోట్లు, యాడికి 1,133 సంఘాలకు రూ.1.32 కోట్లు, పెద్దపప్పూరు 707 సంఘాలకు రూ.90.96 లక్షలు, పెద్దవడుగూరు మండంలోని 918 సంఘాలకు రూ.1.26 కోట్లు మంజూరయ్యాయి. నిధుల విడుదలపై పొదుపు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

పక్కాగా ఓటరు నమోదు



రాయలచెరువులో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

యాడికి: పక్కాగా ఓటరు నమోదు చేపట్టాలని తాడిపత్రి నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసులు బీఎల్‌ఓలను ఆదేశించారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని రాయలచెరువు, కోనుప్పలపాడులో ఓటరు సర్వేను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పార్టీల నాయకుల నుంచి వచ్చే ఫిర్యాదులపై సమగ్రంగా విచారించి నివేదికలను రూపొందించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఒకే చిరునామాలో ఎక్కువ ఓట్లు ఉంటే విచారణ చేయాలన్నారు. వందేళ్లు దాటిన ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. ఓటు ఒక చోట ఉంచి ఓటరు మరో చోట నివాసం ఉంటే ఓటరు అభీష్టం మేరకు ఓటు ఎక్కడ ఉంచాలో నిర్ణయం తీసుకోవాలన్నారు. తహసీల్దార్ అలెగ్జాండర్, డీటీ బాలమ్మ, రీసర్వే డీటీ రాజ్ మార్, ఆర్‌ఐ ఆనంద్ బాబు ఆచారి పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ రాము బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో ఇంటింటా రీ వెరిఫికేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలకు తగు సలహాలు, సూచనలిచ్చారు. టీపీఎస్ అబ్దుల్ సత్తార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఓటర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ నాగభూషణ పేర్కొన్నారు. శుక్రవారం గుత్తిఅనంతపురం, కాశేపల్లి, మిడుతూరు గ్రామాల్లో ఓటర్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓ లు మరణించిన వారి ఓటు తొలగించడంలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

దేవుని ఉప్పలపాడు సర్పంచ్ స్థానం ఏకగ్రీవం



కాటమయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: దేవుని ఉప్పలపాడు సర్పంచ్ స్థానానికి సంబంధించి ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిలాన్‌బాషా నామినేషన్ పత్రాలను పరిశీలించారు. సర్పంచు స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుతో కాటమయ్య, అశ్వత్థ నామినేషన్లు వేశారు. ఇందులో అశ్వత్థ నామినేషన్ పత్రాల్లో పేరు మార్పు ఉండటంతో తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నామినేషన్ పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం కాటమయ్య ఒక్కరే బరిలో నిలిచారు. కాటమయ్య ఎన్నిక ఏకగ్రీవం కానున్న నేపథ్యంలో వైఎస్సార్ జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి తాడిపత్రి వెళ్లి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటమయ్యను అభినందించడంతో పాటు దుశ్శాలువాతో సన్మానించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: సొరకాయలపేట, ఎద్దులపల్లి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

రాజీకి అవకాశమున్న కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏడీజే శ్రీనివాసులు

గుత్తి: వచ్చే నెల 9న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కరించాలని ఏడీజే శ్రీనివాసులు పోలీసు అధికారులకు సూచించారు. పట్టణంలోని ఏడీజే కోర్టులో శుక్రవారం సాయంత్రం జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై గుత్తి, పామిడి, యాడికి సీఐలు, ఎస్‌ఐలు, బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని కేసులను పరిష్కరించాలన్నారు. కక్షిదారులను ఒప్పించి రాజీ చేయాలన్నారు. సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు టి.హరిత, వి.దీప్తి , బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ బాబు, ప్యానల్ లాయర్లు పాల్గొన్నారు.

రజకులకు దోబీఘాట్లు ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న

బుక్కరాయసముద్రం: కొట్టాలపల్లి, భద్రంపల్లి, బీకేఎస్‌లలో దోబీఘాట్లు ఏర్పాటు చేయాలని రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీకేఎస్, కొట్టాలపల్లి, భద్రంపల్లిలో దోబీఘాట్లు లేక రజకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు దోబీఘాట్లు, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. రజకాభివృద్ధి సంస్థ జనరల్ సెక్రటరీ కమ్మన్న, వైస్ చైర్మన్ సుంకన్న, బొమ్మలాటపల్లి సర్పంచ్ సుధాకర్ రెడ్డి, హనుమంతు, కొట్టాలపల్లి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

పుట్లూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అటెండర్‌గా పని చేస్తున్న మాధవి తన భర్త పురుషోత్తం జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.25 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను అందజేసింది. మైక్ సెట్‌తో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి అనువుగా ఉంటుందని హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

గుత్తి: వార్డు స్థానాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసినట్లు అధికారులు ప్రకటించారు. ధర్మాపురం, చెర్లోపల్లి, పెద్దొడ్డి, లచ్చానపల్లి, అబ్బేదొడ్డి వార్డు స్థానాలకు ఈనెల 19న పోలింగ్ జరుగుతుందన్నారు. ఇసురాళ్ల పల్లిలో ఒకే నామినేషన్(లక్ష్మీకాంతమ్మ) దాఖలు చేసింది. ఐదు గ్రామాల్లో ఇద్దరు చొప్పున వార్డు సభ్యులుగా బరిలో ఉన్నారు.

యల్లనూరు: మండలంలోని జంగంపల్లి సర్పంచు, పాతపల్లి, బొప్పేపల్లి వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్లను శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్ ప్రసాద్ పరిశీలించారు. ఆయా గ్రామాల అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

యల్లనూరు: ఇటీవల మండల కేంద్రంలో జరిగిన బంగారు గొలుసు చోరీ కేసులో నిందితుడిని ఎస్ఐ రామకృష్ణ అరెస్ట్ చేశారు. మండల కేంద్రంలోని పోస్టాఫీసు సమీపంలో రెండురోజుల కిందట లక్షుమమ్మ మెడలో బంగారు మంగళసూత్రం ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు చుక్కలూరుకు చెందిన జయరాముడును ఎస్ఐ శుక్రవారం అరెస్ట్ చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తాడిపత్రి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. కేసు ఛేదించిన ఎస్ఐతోపాటు సిబ్బందిని డీఎస్పీ వెంకటశివారెడ్డి అభినందించారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: ప్రజా ప్రతినిధులు, అధికారులంతా మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సరసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ఆయా శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి అధికారులను కోరారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏఓ శ్రీవాణి, వైస్ ఎంపీపీ రామగోపాల్, ఎంఈఓ లింగానాయక్, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, డాక్టర్లు శ్రీహర్ష, లక్ష్మి స్వాతి, ఏపీఓ పోలేరయ్య పాల్గొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

పామిడి: ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ భోగతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల మీట్ సజావుగా జరిగింది. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతిని వివరించారు. వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీలుమజ్జిగ రాజశేఖర్, సుధాకర్‌శర్మ, సర్పంచ్‌లు డీసీ ముత్యాల్‌రెడ్డి, పార్వతి, వెంకటేష్‌నాయక్ తదితరులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. రూ.18.20 కోట్లతో పామిడిలో సబ్ సర్ఫేస్ డ్యామ్ ఏర్పాటుతో పాటు మండలంలోని 10 చెరువులను పునరుద్ధరిస్తామని మైనర్ ఇరిగేషన్ ఏఈ తెలిపారు. జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, డీటీ లక్ష్మినారాయణరెడ్డి, ఏఓ డీ లీనా వసుంధర, ఈఓఆర్డీ బీవీ శశికళ, ఎద్దులపల్లి వైద్యాధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా మండల మీట్

పెద్దవడుగూరు : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. అధికారులు ఆలస్యంగా రావడంతో 12 గంటలకు సమావేశం జరిగింది. సమావేశానికి కొందరు అధికారులు హాజరుకాకపోవడంపై ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండల వ్యాప్తంగా 275 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. ఎంఈఓ రాముడు, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు

గార్లదిన్నె: ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు.శుక్రవారం ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,6705 ఎకరాలు సాధారణ సాగు ఉంటే ఇప్పటి వరకు 8 వేల ఎకరాలు మాత్రమే వేరుశనగ , కంది, ఆముదం, పత్తి వంటి పంటలు సాగుచేశారన్నారు. ఉలవలు, పెసర, అలసంద, కొర్ర వంటి ప్రత్యామ్నాయ విత్తనాలను ఆర్బీకే కేంద్రాలు ద్వారా 80 శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు ఈనెల 14లోపు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అన్నదాతలకు అందుబాటులో ఉండాలి

యాడికి: ఆర్‌బీకే సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఏడీఏ వెంకటరాముడు ఆదేశించారు. శుక్రవారం రాయల చెరువు రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కియోస్క్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏఓ మహబూబ్‌బాషా, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని 132–33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈఈ రంగస్వామి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాదకద్రవ్యాలతో దుష్పరిణామాలు

గుంతకల్లు రూరల్: మాదకద్రవ్యాలతో దుష్పరిణామాలకు గురికావాల్సి వస్తుందని సెబ్ సీఐ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ బాలాజీ, ఎస్ఐ చంద్రశేఖర్, అడ్వకేట్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తదితరులు మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

యాడికి: ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి అప్పయ్య అన్నారు. శుక్రవారం వెంగన్నపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్, 104 వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

యాడికి: మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. వివరాలు..మండల కేంద్రానికి చెందిన వడ్డే శ్రీనివాసులు, రాజ్యలక్ష్మీ దంపతుల కుమార్తె హరిత తాడిపత్రిలో ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతోంది. గురువారం కళాశాలకు వెళ్లిన హరిత తిరిగిరాలేదు. దీంతో తెలిసినచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతే అన్నిటికీ మూలాధారం

గుంతకల్లు రూరల్: ప్రకృతే అన్నిటికీ మూలాధారం అన్ని సినీపాటల రచయిత, వాగ్గేయకారుడు, ప్రకృతి ప్రేమికుడు జయరాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శస్త్ర జూనియర్ కళాశాల, శంకరానంద గిరీ జూనియర్ కళాశాలల్లో ప్రకృతిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అధ్యాపకులు జయరాజునుఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు బ్రహ్మానందరెడ్డి, శేఖర్, రమణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం

పామిడి: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమని సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆర్డీటీ గ్రామీణ ప్రాంతాల బాలికల అథ్లెటిక్స్ మీట్ ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఈసందర్భంగా రన్నింగ్‌రేస్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీల విజేతలకు ఆయన మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏటీఎల్ నాగరాజు, పెనకచెర్ల, ఎద్దులపల్లి, గార్లదిన్నె పాఠశాలల విద్యార్థినులు, పీడీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి



కండ్లపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం కండ్లపల్లిలో సర్పంచ్ కోటంక రామ్మోహన్‌రెడ్డి, నాయకులు తిరుమలరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నెల్లి హనుమంతరెడ్డి, గుంతకలు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, నైరుతిరెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారికి ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. కండ్లపల్లి–అప్పాజీపేట రోడ్డును పునరుద్ధరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రోడ్డు పునరుద్ధరణకు చేపట్టాలంటూ ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా కులం, మతం, పార్టీ అన్న బేధం లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అధికారం కోసం మోసపూరిత హామీలు ఇస్తున్న బాబును, సినీ డైలాగ్‌లతో మాటల గారడీ చేస్తున్న పవన్ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాధించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు జోజోడే కుమార్, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, ఫర్యాద్, నక్కా ఓబులేసు, మహేశ్వర్‌రెడ్డి, వెంకటగుప్తా పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

గుంతకల్లుటౌన్: కన్నతల్లి లాంటి వైఎస్సార్‌సీపీలో ఉంటూ పార్టీకి నష్టం కలిగించే కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద బీజేపీ నిర్వహించిన ధర్నాలో వైఎస్సార్‌సీపీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన ఓబుళాపురం సర్పంచ్ రమేష్‌రెడ్డి, నెలగొండ సర్పంచ్ భర్త, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ పాటిల్ జయరామిరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వీరిద్దరినీ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అధిష్టానానికి సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు. మహాధర్నాకు ఎవరెవరు వెళ్లారనే విషయమై విచారిస్తున్నామని, నివేదిక అందగానే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

జాబ్‌మేళాలో 70 మందికి ఉద్యోగాలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. అశోక్ లేలాండ్ కంపెనీ ప్రతినిధులు శివరామకృష్ణ, శివకుమార్, చిరంజీవి అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 70 మందికి ఉద్యోగం కల్పించినట్లు ప్రిన్సిపాల్ టి.నరేంద్రనాథ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: తాడిపత్రి మండలం ఇగుడూరు వద్ద పెన్నానది నుంచి నాగేష్ అనే వ్యక్తిని ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా కమలపాడు రహదారిలో పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

ఘనంగా 'నా భూమి- నా దేశం'

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురం, నీలాంపల్లిలో శుక్రవారం నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సచివాలయాలు ఎదట మొక్కలు నాటి జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం అమరవీరుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ సునీత, మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి, ఎంపీడీఓ విజయభాస్కర్, సర్పంచులు కొండన్న, రసూల్ బీ, ఈఓఆర్‌డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

నార్పల:నా భూమి– నా దేశం కార్యక్రమం ద్వారా ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించవచ్చని వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సర్పంచు మనీల సుప్రియ పేర్కొన్నారు. శుక్రవారం వారు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, చికెన్ గోపాల్, మోహన్, శంకర్, సాయి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి: నంద్యాల రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో మట్కా రాస్తున్న బీటర్ రామాంజినేయులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.10 వేల నగదుతోపాటు మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

గద్దర్ ఆశయ సాధనకు పాటుపడదాం



గద్దర్ చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

గుంతకల్లుటౌన్: పీడిత ప్రజల గొంతుక, వాగ్గేయకారుడు గద్దర్ ఆశయ సాధనకు పాటుపడతామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ తెలిపారు. శుక్రవారం భగత్‌సింగ్ సర్కిల్‌లో గద్దర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. గద్దర్ మరణం పీడిత ప్రజలకు తీరనిలోటన్నారు. గద్దర్ ప్రజల మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన పాడిన విప్లవ పాటలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, రామాంజనేయులు, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు రఘునాథరెడ్డి, దేవేంద్ర. పీఓడబ్ల్యూ నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ, తదితరులు పాల్గొన్నారు.